క్లుప్తంగా

లిఫ్టు పనుల పరిశీలన

పెర్కిట్: ఆలూర్ మండలం మచ్చర్లలో చేపడుతున్న పోచంపాడ్ బ్యాక్ వాటర్ లిఫ్ట్ పనులను కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మచ్చర్లలో చేపడుతున్న లిఫ్ట్ అందుబాటులోకి వస్తే సుమారు 2,850 ఎకరాలకు సాగు నీరు అందుతుందని అన్నారు. ఆయన వెంట పార్టీ ఆలూర్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్, నాయకులు ఎం మహిపాల్, జితేందర్, వినోద్, శేఖర్, సుదర్శన్, రమేశ్, మల్లేశ్, సాయిలు, సంతోష్, రవి, రాము తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆర్మూర్‌టౌన్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని హెల్త్ అసిస్టెంట్ సురేశ్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని 11వ వార్డులో ఘన వ్యర్థపదార్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మున్సిపల్ అధికారులు ఇంటింటికి తిరుగుతూ సింగిల్ యూస్ ప్లాస్టిక్ బ్యాన్ చేయాలన్నారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, వార్డు ఆఫీసర్లు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

నిధులు ఇప్పించాలని గ్రామస్తుల వినతి



మాక్లూర్: రామాలయ ప్రహరీ నిర్మాణంతో పాటు లోపలి భాగంలో సీసీ వేయటానికి నిధులు ఇప్పించాలని కోరుతూ ఢీకంపల్లి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు శుక్రవారం కాంగ్రెస్‌పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి విన్నవించారు. సానుకూలంగా స్పందించి ఆయన ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని అన్నారు. కాలగడ్డ వినోద్, శేఖర్, సుదర్శన్, రమేశ్, మల్లేశ్, సాయిలు, సంతోష్, రాము, రవి పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్..

బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి పోచంపాడ్ కాలనీకి నీటి సరఫరా చేసే ఇనుప పైప్‌లైన్ పగిలి రంధ్రం ఏర్పడింది. దీంతో నీరు లీకేజీ ఏర్పడి వంతెన మొత్తం నీరు నిండింది. ప్రాజెక్ట్ నీటి విడుదలకు ప్రజాప్రతినిధులు వస్తారని భావించిన అధికారులు ఏర్పడిన పైపులైన్ లీకేజీకి ప్లాస్టిక్ టేపు ఏర్పాటు చేయడంపై సాక్షి దినపత్రికలో గురువారం 'పగిలిన పైపు లైన్' అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు పైపులైన్‌కు వెల్డింగ్ చేయించారు. దీంతో నీటి లీకేజీ నిలిచి పోయింది.

వీడీసీపై చర్యలు తీసుకోవాలి



వేల్పూర్: ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్‌లో మాదిగలను సాంఘిక బహిష్కరణ చేసిన వీడీసీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వేల్పూర్ మండల అంబేద్కర్ సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం వేల్పూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సుర్బిర్యాల్ వీడీసీ విధించిన సాంఘిక బహిష్కరణపై నిరసన వ్యక్తం చేశారు. ఆర్మూర్ డివిజన్‌లో దళితులను, బడుగు బలహీన వర్గాలను వేధిస్తున్న వీడీసీలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు జె.ప్రభాకర్, ఉపాధ్యక్షుడు శివకృష్ణ, పాల్‌రాజ్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పసుపు వాగుకు స్వల్ప వరద



బోధన్: బోధన్ పట్టణ శివారు నుంచి మండలంలోని నాగన్‌పల్లి, పెద్ద మావంది, చిన్న మావంది, పెగడాపల్లి గ్రామాల శివారులో విస్తరించి ఉన్న పసుపు వాగుకు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు స్వల్ప వరద చేరింది. ఎగువ ప్రాంతంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాగు మరింత వరద పెరిగే అవకాశాలున్నాయి. వరద నీటితో వాగుకు జలకళ సంతరించుకుంది.

మాక్లూర్‌లో తగ్గిన క్రైమ్ రేట్

- నిఘా పెరిగి దారి దోపిడీలకు బ్రేక్
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



మాక్లూర్: మాక్లూర్ పోలీస్‌స్టేషన్ దాస్‌నగర్‌కు మారడంతో క్రైమ్‌రేట్ తగ్గిందని ప్రజలు, పోలీసులు పేర్కొంటున్నారు. ఇంతకు ముందు మండలంలోని మాదాపూర్ శివారులో ఉన్న పీఎస్ హైవే కు దూరంగా ఉండేది. వ్యాపారాసముదాయాలు, తండాలు ఎక్కువగా ఉన్న దాస్‌నగర్ శివారు ప్రాంతంలోనే గతంలో నేరాలు ఎక్కువగా జరిగేవి. చిన్నాపూర్ గండి దారి దోపిడీలకు నిలయంగా ఉండేది. రాత్రి 8 అయిందంటే ఈ ప్రాంతం నుంచి టూ వీలర్ వాహనాలు వెళ్లాలంటేనే భయపడేవారు. మార్కెట్ కమిటీ చెక్‌పోస్టులో డ్యూటీలు నిర్వహించే సెక్యూరిటీ గార్డులు సైతం భయంభయంగానే విధులు నిర్వహించే వారు. చైన్ స్నాచింగ్‌లు కూడా ఎక్కువగా జరిగేవి. ఇలాంటి పరిస్థితుల్లో దాస్‌నగర్ శివారులోకి మాక్లూర్ పీఎస్ మారడంతో ప్రస్తుతం నేరాల సంఖ్య తగ్గింది. సమీపంలో ఉన్న కళాశాలల విద్యార్థుల ఈవ్‌టీజింగ్ పూర్తిగా తగ్గిపోవడంతో విద్యార్థులు ప్రశాంతంగా కళాశాలలకు వెళ్తున్నారు. చిన్నాపూర్ గండిని ఆధారంగా చేసుకుని దారి దోపిడీలకు పాల్పడే నిందితుల సంఖ్య తగ్గిపోయింది. దీంతో స్థానిక ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.

భయం..భయంగా ఉండేది



మాక్లూర్ పీఎస్ దాస్‌నగర్‌కు రావడం శుభపరిణామం. ఈ ప్రాంతంలో హైవే ఉన్నందున వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. చిన్నాపూర్ గండిలో దారి దోపిడీలు ఎక్కువగా జరిగేవి. రాత్రి 9 అయిందంటే ఈ ప్రాంతంలో ప్రయాణించాలంటే భయం..భయంగా ఉండేది.

– రాయ్‌సింగ్, మాజీ కార్పొరేటర్, మాణిక్‌భండార్ తండా

ఇబ్బంది ఉండదు



మాదాపూర్‌లో ఉన్న పీఎస్ దాస్‌నగర్‌కు మారడం వల్ల కొద్దిగా దూరం అవుతుంది. కానీ పెద్దగా ఇబ్బంది ఉండదు. దాస్‌నగర్ సమీపంలో ఎక్కువ నేరాలు జరుగుతున్నందున పోలీసు ఉన్నతాధికారులు పీఎస్‌ను మార్చారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో నేరాల సంఖ్య తగ్గింది.

– శిలారి సుధాకర్, వల్లభాపూర్, మాక్లూర్

ఈవ్‌టీజింగ్ తగ్గింది



పోలీస్‌స్టేషన్ మాక్లూర్ నుంచి దాస్‌నగర్‌కు మారడంతో క్రైం రేట్ చాలా తగ్గింది. అంతే కాకుండా సమీపంలో ఉన్న కళాశాలల విద్యార్థుల ఈవ్‌టీజింగ్ పూర్తిగా తగ్గిపోవడంతో విద్యార్థులు ప్రశాంతంగా కళాశాలలకు వెళ్తున్నారు. చిన్నాపూర్ గండిని ఆధారంగా చేసుకుని దారి దోపిడీలకు పాల్పడే నిందితుల సంఖ్య కూడా తగ్గిపోయింది.

– రాజశేఖర్, ఎస్సై, మాక్లూర్

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ వికాస్

రుద్రూర్: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో వైద్యులకు సూచించారు. రుద్రూర్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని ఐ ఎల్ ఆర్ గది, ల్యాబ్, డ్రగ్ స్టోర్, ప్రసూతి గదులను పరిశీలించారు. ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నర్సరీకి ఆస్పత్రి బోరును వినియోగిస్తున్నారని, దీని వల్ల విద్యుత్ బిల్లు అధికంగా వస్తోందని వైద్య సిబ్బంది సబ్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. నర్సరితో పాటు పిచ్చి మొక్కలు పరిసరాల్లో ఉన్నందున విషపురుగులు రాత్రి వేళ ఆస్పత్రిలోకి వస్తున్నాయని సిబ్బంది తెలిపారు. స్పందించిన సబ్ కలెక్టర్ ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఫోన్ ద్వారా ఆదేశించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి అయేషా సిద్దిఖ, హెల్త్ సూపర్‌వైజర్ రవి, ల్యాబ్ టెక్నీషియన్ తరుణ్, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది ఉన్నారు.

పల్లికొండలో వనమహోత్సవం

మోర్తాడ్: భీమ్‌గల్ మండలం పల్లికొండలో వనమహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సిబ్బందితో మొక్కలు నాటిస్తున్నట్లు ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ తెలిపారు. నాటిన వెయ్యి మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీవో నర్సయ్య, టెక్నికల్ అసిస్టెంట్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుంజిళ్లు శిక్ష కాదు..

మోర్తాడ్: విద్యార్థులు తప్పు చేస్తే గతంలో ఉపాధ్యాయులు గుంజిళ్లు తీయించేవారని అది శిక్ష కాదని సూపర్ బ్రెయిన్ యోగా అని రిటైర్డ్ అధ్యాపకుడు, గుంజిళ్ల జాతీయ ప్రచారకుడు అందె జీవన్‌రావు అన్నారు. గుంజిళ్లు తీయడం వల్ల జ్ఞాపక శక్తి మెరుగుపడుతుందని తెలిపారు. శుక్రవారం భీమ్‌గల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ విద్యా సంస్థలో ఆయన గుంజిళ్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ జ్ఞాపక శక్తిని పెంపొందించుకోవడానికి ప్రతి రోజు గుంజిళ్లు వీలైనన్ని తీయాలని సూచించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువా వేసి ఆహ్వానిస్తున్న వినయ్‌రెడ్డి


నందిపేట్: మండలంలోని వెల్మల్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌కుమార్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి వినయ్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో వెల్మల్‌కు చెందిన బీజేపీ, బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఉమ్మెడ మహేశ్, పబ్బ మహేందర్, సున్న రజనీకాంత్, గాదరి నవీన్, సాయిల్, మోహన్, 60 మంది కార్యకర్తలు ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, గాదారి గోపి, మచ్చర్ల సిద్ద గంగారాం, మాజీ ఎంపీటీసీ గాదరి శ్రీధర్, మాజీ ఉప సర్పంచ్ బీఆర్ గంగాధర్, నాయకులు గోదురు అరుణ్, గోదురు గంగాధర్, గోధుల రాజేందర్, చింతకుంట సురేశ్, మెకానిక్ మల్లేశ్ నాయకులు పాల్గొన్నారు.

కేంద్రం బీసీ బిల్లును ప్రవేశపెట్టాలి



మోర్తాడ్: ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డీసీసీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టి బీసీలకు న్యాయం చేయాలని కోరారు. శుక్రవారం ఏర్గట్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతరకు ముస్తాబైన చౌడేశ్వరి ఆలయం



సీహెచ్ కొండూరులోని చౌడేశ్వరి ఆలయం



అలంకరణలో చౌడేశ్వరి దేవి అమ్మవారు

నందిపేట్: మండలంలోని సీహెచ్ కొండూర్‌లో ఉన్న చౌడేశ్వరి ఆలయం రాఖీ పండుగకు ముస్తాబైంది. బండరాతిపై వెలసిన చాముండేశ్వరి అమ్మవారి భక్తుల కోరికలు తీర్చే మాతగా ప్రసిద్ధి చెందింది. ప్రతి ఏడాది రాఖీ పండుగ సందర్భంగా ఈ ఆలయంలో జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా శనివారం రాఖీ పౌర్ణమి సందర్భంగా జాతరకు ఆలయాన్ని గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు అందంగా ముస్తాబు చేశారు. జాతరకు నిజామాబాద్, నిర్మల్ జిల్లాల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రంగనాథుని గిరి ప్రదక్షిణకు సిద్ధం..!



బాల్కొండ: ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌ను ఆనుకుని బాల్కొండ మండలం జలాల్‌పూర్ శివారులో ఉన్న రంగనాథుని గిరి ప్రదక్షిణకు గ్రామస్తులు సర్వం సిద్ధం చేశారు. శనివారం పండితుల మంత్రోచ్ఛరణల మధ్య గిరి ప్రదక్షిణను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎంతో మహిమానిత్వం గల రంగనాథుడు జలాల్‌పూర్ వాసుల కొంగు బంగారం. కొండ లోపల ఉన్న గుహలో పెద్ద బల్లపరుపు బండరాయికి సేదతీరుతున్న ఆకారంలో రంగనాథుడు స్వయంగా వెలిశాడు. ఇన్నాళ్లు గిరి ప్రదిక్షణ చేసేందుకు మార్గం లేదు. ప్రస్తుతం గుట్టను తవ్వి, బండరాళ్లను పగుల గొట్టి మార్గాన్ని ఏర్పాటు చేశారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం



ఆలూర్: ఆదర్శనగర్‌లో వరలక్ష్మి వ్రతం చేస్తున్న మహిళలు



రాయకూర్‌లో..

పెర్కిట్/ రుద్రూర్: ఆర్మూర్‌తో పాటు ఆలూర్ మండలంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మహిళలు శుక్రవారం భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించారు. ప్రత్యేక పూజలు చేశారు. కోటగిరి, పోతంగల్, రుద్రూర్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో మహిళలు వరలక్ష్మి వ్రతం ఆచరించి పూజలు నిర్వహించారు.

మురికి కాలువలను నిర్మించండి సారూ..



నడిమి తండాలో నిలిచిన మురికి నీరు



పంటపొలాల్లోకి ప్రవహిస్తున్న మురికి నీరు

- నడిమి తండాలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు
- ఇబ్బందిపడుతున్న తండావాసులు

బాల్కొండ: మెండోరా మండలం నడిమి తండాలో మురికి కాలువలు లేక పోవడంతో మురికి నీరు రోడ్లపై పారుతూ పంట పొలాలకు ప్రవహిస్తోంది. దీంతో మురికి కాలువలను నిర్మించండి సారూ అంటూ తండా వాసులు వేడుకుంటున్నారు. నడిమి తండాలో 80 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. తండాలో రోజు రోజుకు ఇళ్ల సంఖ్య పెరుగుతున్నా అభివృద్ధి మాత్రం కనిపించడం లేదు. గత ప్రభుత్వ హయాంలో తండా నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడింది. జీపీగా ఏర్పడినా అభివృద్ధి మాత్రం కానరావడం లేదు. తండాలో మురికి కాలువలు, సీసీ రోడ్లు లేవంటు తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురికి కాలువలు లేక పోవడంతో దోమలు ఎక్కువగా పెరిగి మలేరియా లాంటి రోగాలు వస్తున్నాయని అన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని తండావాసులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

మురికి కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు వెంటనే కాలువలను నిర్మించాలి. సీసీ రోడ్లు లేక మురికి నీరు వాన నీరు రోడ్లపై నిలుస్తోంది. దీంతో రోగాల భారీన పడుతున్నాం. పాలకులు స్పందించాలి. – సునీత, తండా వాసి

పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలు



బాల్కొండ: కృష్ణవేణి పాఠశాలలో రాఖీలు కడుతున్న విద్యార్థులు



వేల్పూర్: మోతె విజ్ఞాన్ స్కూలులో



గొట్టిముక్కుల నరేశ్ మెమోరియల్ పాఠశాలలో..



ఆర్మూర్: జెంటిల్ కిడ్స్ పాఠశాలలో..

పెర్కిట్/ ఆర్మూర్‌టౌన్/ బాల్కొండ/ వేల్పూర్/ మాక్లూర్/ కోటగిరి/ మోర్తాడ్: ఆర్మూర్‌తో పాటు ఆలూర్ మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో శుక్రవారం రక్షాబంధన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒకరి ఒకరు రక్షగా రాఖీని కట్టుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని జెంటిల్ కిడ్స్ ప్లే స్కూల్‌లో, బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని ప్రయివేటు పాఠశాలల్లో, వేల్పూర్ మండలం మోతె విజ్ఞాన్ స్కూల్‌లో, మాక్లూర్ మండలం గొట్టిముక్కల నరేశ్ మెమోరియల్ పాఠశాలలో, కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ వేద హైస్కూల్‌లో, మోర్తాడ్‌లోని కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. రాఖీ ఆకారంలో విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్మూర్ పట్టణంలోని మాధవి విద్యాలయంలో..



మోర్తాడ్: కృష్ణవేణి పాఠశాలలో రాఖీ ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన

మైక్రో ఫైనాన్స్ నిర్వాహకుడిపై సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు



బోధన్: పట్టణ కేంద్రంలోని ఓ మైక్రో ఫైనాన్స్ సంస్థ నిర్వాహకుడు దౌర్జన్యంగా తన బైక్‌ను లాక్కెళ్లాడని చెక్కిక్యాంప్ ప్రాంతానికి చెందిన సాయాడ్ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి వరదయ్యతో కలిసి శుక్రవారం బోధన్ సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. మైక్రో ఫైనాన్స్ నిర్వాహకుడి వద్ద రెండేళ్ల క్రితం అవసరాల నిమిత్తం రూ.2 లక్షలు అప్పు తీసుకున్నానని అనారోగ్యంతో నెలవారి కిస్తులు చెల్లించలేక పోయాయని తెలిపారు. ఈ క్రమంలో తన నుంచి జరిమానాలు, అధిక వడ్డీ వసూలు చేశారన్నారు. మిగిలిన వడ్డీ డబ్బులు త్వరలోనే చెల్లిస్తానని చెప్పినా వినకుండా ఈ నెల 6న తన బైక్‌ను సురేశ్ అనుచరులు లాక్కెళ్లారని పేర్కొన్నాడు. ఫిర్యాదుపై సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు.

రహదారికి మరమ్మతులు

కమ్మర్‌పల్లి: వర్షాలకు బురదమయంగా మారిన మండలంలోని కోనాపూర్–భూషణ్‌రావుపేట రహదారికి ఇరు గ్రామాల రైతులు కలిసి స్వచ్ఛందంగా మరమ్మతులు చేపట్టారు. వర్షాలకు బురదమయమై వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారిన రహదారిని బాగు చేసేందుకు సంబంధిత అధికారులు, పాలకులు స్పందించకపోవడంతో శుక్రవారం జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం భూషణ్‌రావుపేట, కోనాపూర్ గ్రామాల రైతులు కలిసి తామే రోడ్డును బాగు చేసుకుందామని నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం బురదమయమైన రహదారిపై మొరం పోయించి గుంతలను పూడ్చారు. ట్రాక్టర్లతో రోడ్డును చదును చేయించారు. రూ. 40 వేల వ్యయంతో రాళ్లవాగు వంతెన సమీపంలో 200 మీటర్ల మేర, భూషణ్‌రావు పేట వెళ్లే దారిలో శివాలయం సమీపంలో 300 మీటర్ల వరకు, తాళ్లమండల వద్ద అర కిలోమీటర్ దూరం వరకు రోడ్డుపై మట్టి పోసి గుంతలను పూడ్చి ట్రాక్టర్లతో చదును చేశారు. దీంతో వాహన రాకపోకలకు మార్గం సులువైంది.



కోనాపూర్, భూషణ్‌రావుపేట రహదారిపై మట్టి పోసిన రైతులు

సంక్షిప్తం

కొత్తపల్లిలో ఇంటింటా బీజేపీ

మాక్లూర్: మండలంలోని కొత్తపల్లిలో శుక్రవారం బీజేపీ జిల్లా కార్యదర్శి గంగోనె సంతోష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటా బీజేపీ కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి పనులను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్‌రెడ్డి, హనుమంతు, బాలరాజు, మనోజ్, రవి, నరేశ్, బాబురావు, గంగాధర్, భూమన్న, ప్రసాద్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

నాగేపూర్ సహకార సంఘం పరిశీలన

నవీపేట: మండల పరిధిలోని నాగేపూర్ ప్రాథమిక సహకార సంఘాన్ని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ శుక్రవారం పరిశీలించారు. ఎరువుల స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేశారు. ఎరువుల ధరలు, నిల్వలు రైతులకు కనబడే విధంగా ప్రదర్శించాలని ఆదేశించారు. రైతులు అవసరాలకు అనుగుణంగా ఎరువుల నిలువ చేసుకోవాలని, జిల్లాలో సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. సహకార సంఘం సేల్స్‌మన్ రఫీ, వ్యవసాయ అధికారి నవీన్ కుమార్ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మ్యాట్‌ల పంపిణీ



రుద్రూర్: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు శుక్రవారం బ్లాక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఫ్లోర్ మ్యాట్లను అందజేశారు. స్థానిక పార్లమెంట్ సభ్యుడు సురేశ్ షెట్కార్ జన్మదినం పురస్కారించుకుని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 8 అంగన్ వాడీ కేంద్రాలకు 16 ఫ్లోర్ మ్యాట్‌లను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పోతరాజు లింగం, షేక్ నిసార్, వడ్ల నరేశ్, గాండ్ల శ్రీనివాస్, రఫీక్, శివ, శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉద్యమకారుడి మృతి



స్వామి (ఫైల్)

రెంజల్: మండలంలోని వీరన్నగుట్ట గ్రామానికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు కొత్తూరు స్వామి (48) శుక్రవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. కొంతకాలంగా స్వామి పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతున్నాడు. ఆరోగ్యం క్షీణించి మృతిచెందాడు. తెలంగాణ ఉద్యమం కోసం 2001 నుంచి నిర్వహించిన అనేక రకాల ఉద్యమాల్లో పాల్గొన్నాడు. 2006లో రెంజల్‌లో సెల్ టవర్ ఎక్కి తెలంగాణ ఇస్తేనే దిగుతానని నినాదించాడు. అనంతరం నిర్వహించిన అనేక ఉద్యమాల్లో భాగస్వామిగా పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ మండల నాయకులు ఉద్యమకారుని మృతికి సంతాపం ప్రకటించారు. అంత్యక్రియలకు పలువురు నాయకులు విరాళాలు పోగు చేసి ఆయన కుటుంబీకులకు రూ. 15 వేల నగదును అందించారు.